

నేడు శంబర ఎనిమిదో వారం జాతర

మక్కువ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ అమ్మవారి ఎనిమిదో వారం జాతర మంగళవారం జరగనుంది. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతరలో ఎటువంటి అవాంఛయనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు నిర్వహించనున్నట్టు ఎస్‌ఐ ఎం.వెంకటరమణ మూర్తి పేర్కొన్నారు. సాలూరు, పార్వతీపురం డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు సంబంధిత డిపో మేనేజర్లు చెప్పారు.


పాలకొండ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులు



ప్రశాంతంగా

● పదో తరగతి పరీక్షలు ప్రారంభం ● తొలిరోజు 47 మంది గైర్హాజరు

పార్వతీపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభ మయ్యాయి. తొలిరోజు సోమవారం 67 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 10,383 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 10,336 మంది వచ్చారు. 99.5 శాతంగా హాజరు నమోదైంది. జియ్యమ్మవలస మండలం చిన్నమేరంగి తదితర ప్రాంతాల్లో కేంద్రాలను డీఈవో తిరుపతినాయుడు, స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. పార్వతీపురం చర్చి వీధిలో ఉన్న డీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తనిఖీ చేశారు.



పార్వతీపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ● పార్వతీపురంటౌన్: పట్టణం లోని ఆర్‌సీఎం సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు, పరీక్షలు జరుగుతున్న తీరును కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. 'వచ్చేనెల ఒకటో తేదీ వరకు టెన్త్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాం. జిల్లా వ్యాప్తంగా 220 పాఠశాలలకు చెందిన 10,455 మంది పరీక్షలు హాజరవ్వాల్సి ఉంది. వారిలో 10, 367 మంది రెగ్యులర్, 88 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. కేంద్రాలకు వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని సంబంధింత శాఖాధికారులను ఆదేశించాం. జిల్లాలోని 67 పరీక్ష కేంద్రాల్లో 67 మంది చీఫ్ సూపరింటెండెట్లు, మరో 67 మంది విద్యాశాఖాధికారులు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాం.' అని కలెక్టర్ వెల్లడించారు.



సాలూరు పురపాలక పాఠశాలలో విద్యార్థులు ఇలా..

కేంద్రానికి చేరుకోవడమే ఓ పరీక్ష..!

కొమరాడ: మండలంలో నాగావళి నది తీరం ఆవల ఉన్న కొట్టు గ్రామం నుంచి టెన్త్ విద్యార్థులు అంబటి అపర్ణ, గుల్ల హేమంత్, కోరాడ వినయ్, పి.కృష్ణ, నాగవాసవి, తదితరులు అతి కష్టం మీద నది దాటి కొమరాడలో పరీక్ష కేంద్రానికి వెళ్లారు. పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తయితే తమకీ కష్టాలు ఉండవని వారు చెబుతున్నారు. నది దాటడమే తమకు అసలైన పరీక్షగా మారిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా నాగావళి నదికి తూర్పు వైపు ఉన్న దాదాపు ఎనిమిది గ్రామ పంచాయతీల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే వ్యయ ప్రయాసలకు గురవ్వాల్సి వస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ వంతెన నిర్మాణానికి రూ. 10 కోట్లు మంజూరు చేశారు. 70 శాతం పనులు పూర్తి చేయగలిగారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ వంతెన నిర్మాణాన్ని పూర్తిగా విడిచి పెట్టింది. ఈ వంతెన పనులు పూర్తయితే కొమరాడతో పాటు కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో పదుల సంఖ్యలో గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది.



'పది' పరీక్షలు రాసేందుకు నాగావళి నది దాటుకుని వెళ్తున్న విద్యార్థిని

ఉపాధి సిబ్బంది బదిలీలకు మార్గదర్శకాలు

● మూడేళ్ల సర్వీసు దాటిన వారికి స్థానచలనం ● 20లోగా ప్రక్రియ పూర్తికి చర్యలు

గరుగుబిల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధి హామీ పథకం విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బదిలీలకు మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఉపాధి డైరెక్టర్ వైవీకే షణ్ముఖకుమార్ ఆదేశాలు జారీ చేశారు. కాగా బదిలీల నిర్వహణకు కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో కలెక్టర్‌తో పాటు డ్వామా పీడీ, అడిషనల్ ప్రాజెక్టు అధికారులు ఉంటారు. వారు కాకుండా మరికొంత మందిని కలెక్టర్ నియమించనున్నారు. ప్రస్తుతం ఉపాధిలో క్లస్టర్ల ఏపీడీల సర్వీసు మూడేళ్లు దాటితే వేరే జిల్లాకు బదిలీ చేయనున్నారు. అదేవిధంగా కార్యాలయం పరిధిలోని సిబ్బందికి ఐదేళ్లు దాటితే విధిగా స్థానచలనం కలగనుంది. క్లస్టర్ల ఏపీడీలు సొంత ప్రాంతానికి చెందిన వారు అయితే వేరే రెవెన్యూ డివిజన్‌కు బదిలీ చేయనున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు ప్లాంటేషన్ విభాగానికి చెందిన వారి సర్వీసు మూడేళ్లు నిండితే క్లస్టర్ల ఏపీడీ కార్యాలయానికి పంపించనున్నారు. ఏపీవోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కూడా వేరే ప్రాంతానికి వెళ్లాల్సిందే. ఐటీడీఏ పరధిలో విధులు నిర్వహిస్తున్న వారికి జీవో నెంబరు 75 మేరకు పని విధానాన్ని పరిశీలించిన తర్వాత బదిలీలు చేయనున్నారు. 50 ఏళ్లు పైబడిన వారికి కొంతమేర వెసులబాటు కల్పించారు. ఫిబ్రవరి 28 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారి దరఖాస్తు పరిశీలన తర్వాత స్థాన చలనం కల్పిస్తారు. మొత్తంగా బదిలీల ప్రక్రియ ఈ నెల 15న ప్రారంభమై 20 నాటికి ముగియనుంది. ఈ నెల 22 నాటికి సిబ్బంది బదిలీలైన స్థానాల్లో విధుల్లో చేరాలి. దీనిపై ఈ నెల 24న పూర్తి సమాచారాన్ని రాష్ట్ర కార్యాలయానికి అందించాల్సి ఉంది.



స్థానికంగా ఉన్న టీఏలు వెళ్లాల్సిందే..

ప్రతి మండలంలో ముగ్గురు నుంచి ఐదుగురు వరకు టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు. గతంలో వారిని వేరే ప్రాంతానికి బదిలీ చేసినా స్థానిక వైసీపీ నేతలు సిఫారసులతో సొంత మండలాల్లోనే తిష్ఠ వేశారు. కొంత మంది వేరే ప్రాంతానికి చెందిన వారమని డ్వామా పీడీకి తప్పుడు సమాచారం అందించి విధుల్లో చేరారు. వాటిపై పరిశీలన చేసి అటువంటి వారిని వేరే మండలాలకు పంపించనున్నారు.

నిబంధనల మేరకే ...

జిల్లాలోని ఉపాధి సిబ్బంది బదిలీలు ప్రభుత్వ నిబంధనల మేరకే చేపడతాం. రాజకీయ జోక్యానికి తావులేకుండా చూస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలాల వారీగా జాబితాలను పరిశీలించాం. సమాచారం సేకరణ కూడా పూర్తయింది. బదిలీ చేసిన ప్రాంతానికి విధిగా సిబ్బంది వెళ్లాల్సిందే.

\- కె.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

'రియల్' దాష్టీకం

● ఏజెంట్‌ను విద్యుత్ స్తంభానికి కట్టేసి..
● దాడి చేసిన 'టౌన్‌షిప్' బంధువులు
● డబ్బులడిగేందుకు వస్తావా అంటూ దూషణ

పాలకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలం ఎల్ఎల్‌పురం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ రేజేటి శేఖర్‌ను సోమవారం అదే గ్రామానికి చెందిన కొందరు విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ కె.ప్రయోగమూర్తి కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్ఎల్‌పురం గ్రామానికి చెందిన వారాడ రాజేంద్రనాయుడు, ఆయన సోదరుడు సుమంత్.. శ్రీసాయిలక్ష్మీ టౌన్‌షిప్ నిర్వహిస్తున్నారు. అందులోనే గత కొద్దిరోజులుగా ఏజెంట్‌గా శేఖర్ విధులు నిర్వహిస్తున్నాడు.

ఈ క్రమంలో ఇళ్ల స్థలాలు కొనుగోలుపై ఆసక్తి ఉన్నవారిని గుర్తించి రూ.కోటి వరకు చెల్లించి వందమందిని టౌన్‌షిప్‌లో సభ్యులుగా చేర్పించాడు. అయితే రోజులు గడుస్తున్నప్పటికీ నగదు చెల్లించిన వారికి టౌన్‌షిప్ యాజమాన్యం ఇళ్ల స్థలాలను కేటాయించడం లేదు. సరైన సమాధానం కూడా ఇవ్వడం లేదు. దీంతో ఈ నెల 16న ఎల్ఎల్‌పురంలో ఉన్న టౌన్‌షిప్ నిర్వాహకుల ఇంటికి వద్దకు టౌన్‌షిప్ సభ్యులతో కలిసి శేఖర్ వెళ్లాడు. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేరని నిర్వాహకుల తల్లి తెలియజేయగా వారంతా తిరిగివెళ్లిపోయారు. కాగా సోమవారం ఉదయం బాధితుడు శేఖర్ ఊరి శివార్లలో కాలకృత్యాలు తీర్చుకొని తిరిగి ఇంటికి వస్తుండగా.. టౌన్‌షిప్ నిర్వాహకుల బంధులు వియ్యపు మురళీ, ఆయన సోదరుడు బొజ్జంనాయుడు అడ్డగించారు. 'డబ్బులు అడిగేందుకు సభ్యులను తీసుకుని ఇంటికి వస్తావా' అంటూ దూషించి దాడి చేశారు. అదే ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టారు. స్థానికులు స్పందించి కట్లు విప్పారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ప్రస్తుతం బాధితుడు శేఖర్ పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు.



శేఖర్‌ను స్తంభానికి కట్టిన దృశ్యం

21న జాబ్‌మేళా

సీతంపేట రూరల్,మార్చి 17 (ఆంధ్రజ్యోతి):నిరుద్యోగ యువత కోసం ఈ నెల 21న సీతంపేట వైటీసీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్ ఇంజనీర్, ప్రొడక్షన్, మిషన్ ఆపరేటర్ ట్రైనీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 250 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.16వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం చెల్లిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన 18నుంచి 35 ఏళ్లలోపు యువతీ, యువకులు అర్హులని వెల్లడించారు. ఇతర వివరాల కోసం 70320 60773, 91546 62567 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎంఈవో సస్పెన్షన్

పాచిపెంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించారన్న కారణంతో పాచిపెంట మండల విద్యాశాఖాధికారి పి.జోగారావును సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఈ మేరకు రీజనల్ జాయింట్ డైరెక్టర్ నుంచి సంబంధిత అధికారులకు ఉత్తర్వులు వచ్చినట్లు సమాచారం. ఈ నెల 13వ తేదీనే ఆర్‌జేడీ నుంచి డీఈవో, ఎంపీడీవోకు కూడా ఆదేశాలు వచ్చినప్పటికీ ఈ విషయాన్ని వెరూ బయటపెట్టలేదు. దీనిపై ఎంపీడీవో పాత్రోను వివరణ కోరగా తనకు ఇప్పుడే ఈ విషయం తెలిసిందని బదులిచ్చారు.

జూన్‌లోగా లక్ష్యాలు పూర్తిచేయండి

● గృహ నిర్మాణాలపై కలెక్టర్ ఆదేశం

పార్వతీపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడు వేల గృహ నిర్మాణాల లక్ష్యాన్ని జూన్ లోగా పూర్తిచేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ దినోత్సవ కార్యక్రమాలు సామూహికంగా నిర్వహించాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో అత్యధిక వస్తున్న రెవెన్యూ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉందన్నారు. స్వచ్ఛ ఆంధ్రా, స్వర్ణ ఆంధ్రా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని , చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలని తెలిపారు. వేసవి ఎండల నేపథ్యంలో విస్తృతంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర పనులు ఉంటేనే బయటకు రావాలని, టోపి, గొడుగు వంటి వాటిని వెంట ఉంచుకోవాలని సూచించారు. ఉపాధి పనులు జరుగుతున్న చోట టెంట్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరం మేరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.హేమలత, గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



గిజబ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

గిజబకు తిరిగొచ్చిన గజరాజులు

గరుగుబిల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో సంచరించిన గజరాజులు సోమవారం తిరిగి గిజబకు చేరుకున్నాయి. దీంతో ఈ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే గిజబ పరిసర ప్రాంతాల్లో చెరకు, అరటి, పామాయిల్ పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. గజరాజుల సంచారంతో వారు పంట పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు అటవీ శాఖ సిబ్బందితో పాటు ట్రాకర్లు ఏనుగుల సంచారాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఆయా ప్రాంతవాసులను అప్రమత్తం చేస్తున్నారు. కాగా ఈ ప్రాంతం నుంచి తక్షణమే ఏనుగులను తరలించాలని పంటలను నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

షూటింగ్‌లో ఆటవిడుపు

● గిరిజన యువకులతో కలిసి వాలీబాల్ ఆడిన రాజమౌళి

సాలూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా తోలోమాలి, దేవ్‌మాలి ప్రాంతాల్లో కొద్ది రోజులుగా మహేష్‌బాబు, రాజమౌళి చిత్రం (ఎస్ఎస్ఎంబీ 29 వర్కింగ్ టైటిల్) షూటింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా సోమవారం రాత్రి దర్శకుడు రాజమౌళి తంకుబేడ గిరిజన యువకులతో కాసేపు వాలీబాల్ ఆడారు. వారితో ఉల్లాసంగా గడిపారు. స్టార్ దర్శకుడు తమతో వాలీబాల్ ఆడడంతో ఆ ప్రాంతవాసులు ఆనందంలో మునిగిపోయారు. ఇదిలా ఉండా కోరాపుట్ జిల్లా జైపూర్‌కు చెందిన ఓ జర్నలిస్ట్, యూట్యూబర్‌ను దర్శకుడు రాజమౌళి ఇంటర్వ్యూ చేశారు. యూట్యూబ్‌లో నటన, ఒడియా చిత్రాల్లో వేసిన పాత్రల గురించి అడిగి తెలుసుకున్నారు. తనకు అవకాశమివ్వాలని ఆ జర్నలిస్ట్ కోరగా మళ్లీ కబురు పంపుతానన్నారు. ఇకపోతే తోలోమాలి, దేవ్‌మాలి ప్రాంతాలకు పర్యటకులు భారీగా తరలివస్తున్నారు.



తంకుబేడలో వాలీబాల్ ఆడుతున్న దర్శకుడు రాజమౌళి

నేడు పోలిపల్లి పైడితల్లి
మారు జాతర



6లో

నిరసనల హోరు

● కలెక్టరేట్ వద్ద వివిధ సంఘాల ఆందోళన
● సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



8లో

భవితను మార్చాలని..!

● పాఠశాలల్లో కేంద్రాల విలీనం
● సాధారణ విద్యార్థులతో ప్రత్యేకావసరాల పిల్లల మమేకం



6లో

● పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం ● అనేక కేంద్రాల్లో సౌకర్యాలు కరువు

● విద్యార్థులకు అవస్థలు

ఉత్సాహంగా..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఆలయాలకు వెళ్లి.. పూజలు చేసి... పరీక్షల బాట పట్టారు. కొన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో తొలి రోజు విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో విద్యుద్దీపాలు, ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతతో అవస్థలకు గురయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉండడంతో ఆటోల్లో కిక్కిరిసి...గమ్యస్థానాలకు చేరుకోవలసి వచ్చింది.

-ఆంధ్రజ్యోతి బృందం


పార్వతీపురం టౌన్: డీవీఎంఎం పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు


వీరఘట్టం: పరీక్షకు హాజరవుతున్న దివ్యాంగ విద్యార్థి భవానీ ప్రసాద్


విజయనగరం: కస్పా హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద...


వీరఘట్టం: పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నెంబరు చూసుకుంటూ..


భామిని: నడవలేని పరిస్థితిలో ఉన్న విద్యార్థిని పరీక్ష కేంద్రానికి తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు



విజయనగరం: ఆలయంలో విద్యార్థి, తల్లి కాళ్లకు దండం పెడుతున్న విద్యార్థి


గజపతినగరం: ప్రభుత్వ బాలికల హైస్కూల్ కేంద్రానికి ట్రైసైకిల్‌పై వస్తున్న విద్యార్థి


విజయనగరం: పరీక్ష కేంద్రానికి వెళుతూ...


రాజాం రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు


జామి: కుమార్తెను ఎత్తుకుని..


జామి: దివ్యాంగుడైన తమ స్నేహితుడికి తోడుగా..

భయం.. భయంగా విధులు

● పెచ్చులూడుతున్న మున్సిపల్ కార్యాలయం

రాజాం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం రాజాం మున్సిపల్ కార్యాలయంలోనిది. దాదాపుగా అన్ని గదుల్లోనూ శ్లాబ్ పైభాగం నుంచి పెచ్చులూడి పడిపోతున్నాయి. సుమారు ఏడు దశాబ్దాల క్రితం పంచాయతీ కార్యాలయం కోసం నిర్మించిన భవనంలోనే మున్సిపల్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. 2005లో నగర పంచాయతీగా, 2022లో థర్డ్‌గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. కానీ భవనాలకు కనీస మరమ్మతులు లేవు. కొత్త భవన నిర్మాణ ప్రతిపాదన కూడా లేదు. ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో సిబ్బంది బితుకు బితుకుమంటూనే విధులు నిర్వహిస్తున్నారు.


ప్రమాదకర పరిస్థితుల్లో ఇలా..



కార్యాలయం బయట పెచ్చులూడి..



ఘనంగా త్రిపురమాంబ తీర్థం

● అలరించిన ఎడ్ల పరుగు పోటీలు

వేపాడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వీలుపర్తి శివారు చినదుంగాడలో త్రిపురమాంబ తీర్థాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. అనంతరం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. వల్లంపూడికి చెందిన సిద్ధివినాయక బండి విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శానాపతి లీలా అప్పారావు, మాజీ సర్పంచ్ కొప్పల అప్పారావు, టీడీపీ నాయకులు గోకాడ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలిపల్లి పైడితల్లి మారు జాతర

రాజాం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి మారు జాతరను మంగళవారం నిర్వహించనున్నారు. ఈనెల 9 నుంచి 11 వరకు అమ్మవారి తొలి జాతర మహోత్సవాలు జరిగాయి. దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం తొలి జాతరలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకునే అవకాశం లేని వందలాది మంది భక్తులు మారుజాతరలో దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈనెల 18న (మంగళవారం) అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. మారు జాతర సందర్భంగా అన్నప్రసాద వితరణ చేయనున్నారు.


ఎంపీడీవో కార్యాలయం వద్ద ట్రాక్ దాటుతున్న ప్రజలు

ప్రమాదమని తెలిసినా..

నెల్లిమర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జూనియర్ కాలేజీ, మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌ను నిత్యం ఎంతో మంది దాటు తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులతోపాటు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలంతా అదే దారిలో నడుస్తున్నారు. ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ ట్రాకుపై నిరంతరం రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జి ఉన్నా దాని పైనుంచి వెళ్లకుండా షార్ట్‌కట్ అని ఈ ట్రాక్ దాటుతూ ప్రయాణం చేస్తున్నారు. గతంలో ఈ ట్రాక్‌పై చాలా ప్రమాదాలు జరిగాయి. అయి నా భయపడకుండా విద్యార్థులు, ఎంపీడీవో కార్యాలయానికి వచ్చే పలువురు ప్రజలు ఈ ట్రాకు పైనుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాక్‌కు అటు వైపు మండల పరిషత్ కార్యాల యం, నెల్లిమర్ల జూనియర్ కాలేజీ, కేజీబీవీ బా లికల పాఠశాల, జ్యోతీబా పూలే బాలికల హాస్టల్, జగనన్న కాలనీ ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఫ్లై ఓవర్ నుంచి కిందకు మెట్లు నిర్మించాలని కోరుతున్నారు.


జూనియర్ కాలేజీ సమీపంలో ప్రమాదకరంగా ట్రాక్ దాటుతున్న విద్యార్థులు


పందిరికి కట్టిన అరటి గెలలు, చీరలు

గంగాదేవి పూజకు శ్రీకారం

బొబ్బిలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని కంచరవీధి జంక్షన్‌లో గంగాదేవి మాత పూజ (గావు పండుగ) కోసం సోమవారం రాత్రి శ్రీకారం చుట్టారు. కూరాకుల సామాజిక వర్గానికి చెందిన కర్రి కుటుంబీకులు ఈ పండుగను నిర్వహిస్తారు. అమ్మవారి గద్దె ఉన్న ఇంటి ముందు చలువ పందిళ్లు వేసి ఆ పందిళ్లకు పెద్దసంఖ్యలో అరటిపండ్ల గెలలు, అమ్మవారి కోసం చీరలు కట్టారు. విద్యుత్ కాంతులతో అలంకరించారు. కులపెద్దలు దాడయ్య, పోతయ్యల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

రేగిడి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలో నిర్వహిస్తున్న సుబ్రమ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో సోమవారం శాంతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఖండ్యాంకు చెందిన వేదపండితుడు అంపోలు రుద్రకోటేశ్వరశర్మ, శిష్య బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యకమంలో సర్పంచ్ కెంబూరు తేజోవెంకటేశ్వరరావు దంపతులు, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భవితను మార్చాలని..!

● పాఠశాలల్లో కేంద్రాల విలీనం

● సాధారణ విద్యార్థులతో ప్రత్యేకావసరాల పిల్లల మమేకం

గరివిడి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకావసరాల పిల్లలు ఇకపై మానసికంగా దృఢంగా తయారయ్యేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. సాధారణ విద్యార్థులతో మమేకం చేయడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచవచ్చుననే భావనతో ముందుకు వెళుతోంది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేకావసరాల పిల్లలకు సహిత విద్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో విలీనమవుతున్నాయి. 2001వ సంవత్సరం నుంచి ప్రత్యేకావసరాల (చెవిటి, మూగ, మానసిక వికలాంగులు, అంధత్వం తదితర 20 రకాల వైకల్యాలు ఉన్న) పిల్లలకు ఉపాధ్యాయుల ద్వారా ఆటపాటలతో పాటు విద్యను అందిస్తున్నారు. కొంతమంది పిల్ల లకు ఇళ్ల వద్ద... పాఠశాలలకు వచ్చే అవ కాశం ఉన్న పిల్లలకు ప్రభుత్వ పాఠశాల ల్లో విద్యను అందించేవారు. 2013లో ఉమ్మడి జిల్లాలో 10 మండలాలను ఎంపిక చేసి భవిత భవనాలను నిర్మించారు. మండలంలోని ప్రత్యేకావసరాల పిల్లలను ఆ భవనాలకు తరలించి బోధించేవారు. జిల్లాలో ప్రస్తుతం 545 మంది భవిత కేంద్రాల ద్వారా విద్యనభ్యసిస్తున్నవారు. ఈ ప్రత్యేకావసరాల పిల్లలను మిగతా పిల్లలతో పోలిస్తే తామేమీ తక్కువ కాదనే విధంగా మానసికంగా సిద్ధం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో భవిత భవనాలను మూసివేసి...పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీనివల్ల పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని వైద్య నిపుణులు కూడా అంటున్నారు. విజయనగరం జిల్లాలో గరివిడి, నెలిమర్ల, డెంకాడ, ఎస్.కోట, కొత్తవలస, బొండపల్లి, గజపతినగరం, రామభద్రపురం, బొబ్బిలి, రాజాం మండలాల్లో మొత్తం 10 భవిత కేంద్రాలు ఉన్నాయి. గత నెల రోజుల నుంచి ఒక్కొక్క భవిత కేంద్రాన్ని పాఠశాలల్లో విలీనం చేస్తున్నారు. ఇందులో భాగంగా గరివిడిలో ఉన్న కేంద్రాన్ని కొండపాలెం ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేశారు. ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రభుత్వం నుంచి వస్తున్న ఎటువంటి అలవెన్సులు, సౌకర్యాలు మాత్రం నిలుపుదల చేయలేదు. వీరు ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించనున్నారు.

మానసిక దృఢత్వానికి...

భవిత కేంద్రాల విలీనంపై సమగ్ర శిక్షా అభియాన్ పీవో ఎ.రామారావును ఫోనులో సంప్రదించగా... ప్రత్యేకావసరాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోని మిగతా విద్యార్థులతో విద్యనభ్యసించడంతో మానసికంగా, శారీరకంగా మరింత దృఢంగా తయారవుతారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.


గరివిడిలో ఉన్న భవిత కేంద్ర భవనం


ఆడుకుంటున్న ప్రత్యేకావసరాల పిల్లలు

స్టాఫ్ నర్సుతో వైద్యసేవలు

ఆంధ్రజ్యోతి విజిట్

- జరజాపుపేట అర్బన్ పీహెచ్‌సీలో అందుబాటులో లేని వైద్యుడు
- నెలరోజులుగా ఇబ్బంది పడుతున్న రోగులు
- సమయ పాలన పాటించని కొందరు సిబ్బంది

నెల్లిమర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నెల రోజులుగా డాక్టర్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ ఉన్న స్టాఫ్ నర్సు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడి డాక్టర్ సెలవుపై పీజీకి వెళ్లారు. అయితే ఇక్కడ కనీసం డిప్యూటేషన్‌పై కూడా డాక్టర్‌ను నియమించకపోవడంతో స్టాఫ్ నర్సు రోగులకు దిక్కయ్యారు. సహజంగా స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. డాక్టర్ లేకపోవడం వల్ల స్టాఫ్ నర్సుతో పాటు మిగిలిన సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నా రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి హెల్త్ సెంటర్‌కు చెందిన ఒకరిద్దరు స్టాఫ్ కూడా సమయపాలన పాటించడం లేదు. ప్రమాదాలు సంభవించే సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స నిర్వహించి ఇతర ఆసుపత్రులకు తరలిస్తున్నారు. అలాగే తనిఖీల నిమిత్తం గర్భిణులు వచ్చినా డాక్టర్ లేకపోవడంతో సుదూరంలోని ఆసుపత్రికి వెళ్లడంతో వారూ ఇబ్బందులు పడుతున్నారు.


రోగులను పరీక్షిస్తున్న స్టాఫ్ నర్సు

వైద్యుడిని నియమించాలి..



వైద్యుడు లేక ఇబ్బందులకు గురవుతున్నాం. నెల రోజులుగా ఎప్పుడు వచ్చినా స్టాఫ్ నర్సే వైద్యం చేస్తోంది. పలు రకాల వ్యాధులకు సరైన చికిత్స అందడం లేదు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

-బుగత సన్యాసమ్మ, జరజాపుపేట

స్టాఫ్ నర్సుతోనే సేవలు..



వైద్యుడు లేకపోవడంతో స్టాఫ్ నర్సుతోనే వైద్య సేవలు చేస్తున్నారు. కాళ్ల నొప్పులతో బాధపడుతూ రెండు నెలలుగా ఆసుపత్రికి వస్తున్నాను. అయినా నయం కాలేదు. వైద్యుడిని నియమిస్తే మేలు.

-భోగి పార్వతి, జరజాపుపేట

సౌకర్యాలు ఉన్నా వృథా



అర్బన్ ప్రైమరీ సెంటర్‌లో అధునాతన పరికరాలు ఉన్నప్పటికీ వైద్యుడు లేకపోవడంతో అవి వృథాగా ఉన్నాయి. సరైన వైద్యుడిని నియమిస్తే ఆధునాతన సౌకర్యాలతో మెరుగైన వైద్యం అందించవచ్చు.

-అవనాపు ముత్యాలు,జరజాపుపేట

ఉపాధిలో అవినీతిని అరికట్టండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం అసెంబ్లీ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కలిసి వేతనదారుల హక్కులను దోచుకుంటున్నార న్నారు. వేతనాల్లో అక్రమాలు, నకిలి మస్తర్లు వంటి అవినీతిని అరికట్టాలన్నారు. వేతనదారులకు వేతనాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. సామాజిక ఆడిట్‌లె పారదర్శకంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దాసన్నపేట 33 కే వీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ త్రినాథ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగపూర్ సిటీ, జమ్ము, నారాయణ పురం, పడాలపేట, ఆనందపురం, బ్యాంకు కాలనీ, తాడివాడ, సీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

●రాజాం రూరల్: పట్టణంలోని పాలకొండ రోడ్‌లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల కారణంగాఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. గాంధీనగర్, డోలపేట, బుచ్చెంపేట, పొనుగుటివలస, వాసవినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హిందీ పరీక్షల ఫలితాల విడుదల

రాజాం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ పరీక్షల ఫలితాలు విడుదల అయ్యాయని హిందీ ప్రచారక్ కొండవలస మధుసూదనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ వరకు ఫిబ్రవరిలో పరీక్షలు జరిగాయని ఆయన తెలిపారు. ఫలితాల కోసం 9949917365 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గొల్లపేరంటాలు ఆదాయం రూ.2.78 లక్షలు

చీపురుపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మెట్లపల్లిలోని గొల్లపేరంటాలు హుండీ ఆదాయాన్ని సోమవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. ఈ నెల 13 నుంచి నాలుగు రోజుల పాటు ఇక్కడ జాతర జరిగిన విషయం తెలిసిందే. అమ్మవారికి హుండీ, ఇతర మార్గాల్లో రూ.2,78,702 లభించినట్టు ఆలయ ఈవో బి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బూటు శ్రీను, గజపతినగరం ఆలయాల మేనేజరు కె.శ్రీరామ్, గ్రామ పెద్దలు వెంపడాపు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

గుర్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజేశ్‌వర్మ అన్నారు. మండలంలోని పున్నపురెడ్డిపేటలో సోమవారం బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పోలిపల్లి కనకరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సంసదర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఉప్పలపాటి రాజేశ్ వర్మ, మండల మాజీ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

నెల్లిమర్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మహిళలు శక్తి యాప్‌ను డైన్‌లోడ్ చేసుకోవాలని విజయనగరం పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ దిక్కులేని దిశలా కాకుండా శక్తి యాప్ సమర్థంగా పనిచేస్తుందన్నారు. మహిళలకు అత్యవసర సమయాల్లో సహాయం అందించేందుకు శక్తి యాప్ కీలకంగా పనిచేస్తుందన్నారు. వన్‌టచ్ ఎస్‌వోఎస్ బటన్ నొక్కిన వెంటనే పోలీసులను అలర్ అవుతారని ఆమె వివరించారు.

యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా అప్పలనాయుడు

శృంగవరపుకోట మార్చి 17 (ఆంధ్రజ్యోతి) శృంగవరపుకోట ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా పి.అప్పలనాయుడును నియమితులయ్యారు. సోమవారం స్థానికంగా ప్రారంభించిన కార్యాలయంలో యూని యన్ నాయకులు, సభ్యుల ఆయన్ని సత్కరించారు.

గ్రంథాలయానికి వాల్ ఫ్యాన్స్ వితరణ

శృంగవరపుకోట మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శాఖా గ్రంథాలయానికి సోమవారం స్థానిక పంజాబ్ నేషనల్ బ్యాంకు ప్రతినిధులు 8 వాల్ ఫ్యాన్‌లను అందజేశారు. పాఠకులకు ఉక్కపోత బాధ తప్ప నుందని గ్రంథాలయ శాఖాధికారి శ్రీధర్ తెలిపారు.

రాజాం పట్టణానికి రైల్వే కనెక్టివిటీ కల్పించాలి

- లోక్‌సభలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

న్యూఢిల్లీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ను అనుసంధానించే విజయనగరం రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించి, భువనేశ్వర్, హైదరాబాద్, చైన్నైతో మెరుగైన కనెక్టివిటీని కల్పించాలని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం, రైల్వే డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఎంపీ కలిశెట్టి మాట్లాడారు. విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి నుంచి శ్రీకాకుళం జిల్లా మీదుగా రాజాం వరకు ప్రత్యేక రైల్వే మార్గ నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజాం పట్టణానికి రైల్వే కనెక్టివిటీ కోసం ఆ ప్రాంత ప్రజలు దశాబ్ధలుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. రైల్వే మార్గం నిర్మాణం కోసం సర్వేలు పూర్తయినా పరిపాలనా జాప్యంతో ప్రాజెక్టు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని అన్నారు. విజయనగరం నుంచి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబాయికి రాత్రివేళల్లో ప్రయాణికుల రైళ్లను నడపాలని కోరారు. పార్వతీపురం, కొమరాడల్లో రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వల్ల ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కారించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

నేడు కోట క్యాంపస్‌లో జాబ్‌మేళా

విజయనగరం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహారాజా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఫోర్టు (కోట) క్యాంపస్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు మంగళవారం ఉదయం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చదివినవారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగినవారు మేళాకు అర్హులన్నారు. బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు మేళాను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వివరాలకు 798926953, 9988853335 నెంబరును సంప్రదించాలని కోరారు.


ఎమ్మెల్యే అదితి

ఉద్యోగ విరమణ వయసు పెంచండి

విజయనగరం రింగురోడు/ ఎస్.కోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 1998, 2008లో పరీక్ష ద్వారా ఎంపికై కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా కనీస వేతన స్కేలుపై పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని యూనియన్ నాయకులు లగుడు వెంకటరావు కోరారు. సోమవారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టరు గాదె శ్రీనివాసులనాయుడిని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా పనిచేసిన తాము 25 ఏళ్ల సర్వీసును కోల్పోయి చివరి దశలో ఉద్యోగం పొందామన్నారు. కనీసం నాలుగేళ్ల సర్వీసు పూర్తికాకుండా, ఉద్యోగ విరమణ చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంటీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రామారావు, ఎం.అప్పలరాజు, అల్లు సురేష్, బంగారునాయుడు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

విజయనగరం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం ఆయా వినతులను క్రోడీకరించి, కలెక్టరేట్‌లోని జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టరు అంబేడ్కర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ పార్టీ కార్యాలయంలో కొన్ని నెలలుగా వినతులు స్వీకరించే కార్యక్రమం జరుగుతోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ఆయా సమస్యలను తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. ముఖ్యంగా విద్యుత్, రెవెన్యూ తదితర వాటిల్లో సమస్యలు ఎక్కువగా వచ్చాయన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్ అంబేడ్కర్‌ని కోరామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న నాగార్జున

కొత్తవలసలో పలుచోట్ల అగ్ని ప్రమాదాలు

కొత్తవలస, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం పలుచోట్ల అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. సోమవారం అగ్నిమాపక అధికారి వై.అశోక్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ముసిరాంలో బవిరిశెట్టి ఈశ్వరరావుకు చెందిన ఎకరా టేకు తోటకు సోమవారం నిప్పంటుకుందన్నారు. రూ.40 వేల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. అనంతరం దేవాడలో అగ్నిప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో వియ్యంపేట గ్రామానికి చెందిన పులిబంటి నర్సునాయుడుకు చెందిన రెండు ఎకరాల్లోని మామిడి, టేకు, నేరేడు తోట దగ్ధమైందన్నారు. సుమారు రూ.45 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌కు 213 వినతులు

విజయనగరం కలెక్టరేట్ మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో ఓయవారం నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై 213 వినతులు వచ్చాయి. వినతులను కలెక్టర్ అంబేడ్కర్, ఇన్‌చార్జ్ జేసీ శ్రీనివాసమూర్తి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినతులు పరిష్కరించిన అనంతరం తెలుగులో వారికి అర్థమయ్యే రీతిలో సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

సమస్యలపై సానుకూలంగా స్పందించండి

విజయనగరం క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌లకు వచ్చే బాధితుల పట్ల సానుకూలంగా స్పందించి చట్టపరిధిలో వారి సమస్యను పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 32 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులపై స్పందించి విచారణ చేపట్టి ఏడు రోజుల్లో తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి వివరాలు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఎస్‌ఐ రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

చీపురుపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రధాన పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో జీవీ సత్యవాణి సోమవారం సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. సమావేశంలో తెలుగుదేశం, జనసేన, వైసీపీ ప్రతినిధులు గవిడి నాగరాజు, కోట్ల కృష్ణ, కోరుకొండ దాలయ్య, ఆర్డీవో కార్యాలయం ఏవో ఆర్.ఈశ్వరమ్మ, డీటీ సూర్యకాంతం, ఎన్నికల డీటీ ఎం.హర్షవర్ధిని తదితరులు హాజరయ్యారు.

విజయ'నగర' అభివృద్ధే లక్ష్యం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధే లక్ష్యంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మేయర్ వి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 80 అంశాలను చర్చించిన అనంతరం మూడు అంశాలను వాయిదా వేయగా, మిగిలిన అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, సుంకరి నారాయణస్వామి, రేగాన రూపాదేవి, జీవీ రంగారావు, కమిషనర్ నల్లనయ్య, సహాయ కమిషనర్ అప్పలరాజు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవపై విచారణ జరిపించండి

- కలెక్టర్‌కు సీపీఎం నేతలు వినతిపత్రం

మెంటాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలో అవినీతిని ప్రక్షాళన చేసేందుకు రిటైర్డ్ న్యాయాధికారితో విచారణ జరిపించాలని సీపీఎం మండల కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం సీపీఎం నేతలతో కలసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఎన్టీఆర్ వైద్యసేవ పేదప్రజల కోసం నిధులు కేటాయింపు జరిగితే ఆసుపత్రి యాజమాన్యాలు కోడ్ మార్చి ప్రభుత్వాన్ని ఏమార్చి సొమ్ము చేసుకుంటున్నాయన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న జిల్లా అధికారులు, టీమ్ లీడర్లు ఆసుపత్రి యాజమాన్యంతో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి ఏటా కోట్ల రూపాయలు టోకరా వేస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాములు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సోములు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

243 మందిపై కేసులు

విజయనగరం క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు గురిచేసిన 283 మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

ప్రవేశ పరీక్ష గడువు పెంపు

నెల్లిమర్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రవేశ పరీక్ష గడువు పొడిగించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ కేటీటీ రావు ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ బ్యాక్‌లాగ్ ఖాళీలకు ఈనెల 25, అలాగే ఇంటర్ సీఈటీ పరీక్షను మే 4న నిర్వహిస్తామన్నారు.

అలమండలో మాస్ కాపీయింగ్ కలకలం

- విద్యాశాఖ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదులు

జామి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ పదో తరగతి పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరుగుతుందంటూ గుర్తుతెలియని వ్యక్తులు డీఈవో, ఎంఈవోలకు సోమవారం ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. మాస్ కాపీయింగ్ కోసం విద్యార్థుల నుంచి రూ.500 చొప్పున వసూళ్లు చేశారని చెప్పడంతో అధికారులు అప్రమత్తయయ్యారు. ఎంఈవో జయశ్రీ వెంటనే పరీక్ష కేంద్రానికి చేరుకుని అక్కడ పరిస్థితులను సమీక్షించారు. ఎస్‌ఐ వీరజనార్దన్‌తో మాట్లాడారు. దాతో బందోబస్తు నిర్వహించారు. విషయం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఇదే విషయంపై ఎంఈవో-2 గంగరాజు వివరణ కోరగా మాస్ కాపీయింగ్ అంటూ ఫోన్లు రావడంతో పరీక్ష ముగిసేవరకు పర్యవేక్షణ చేశామని తెలిపారు.


పరీక్ష కేంద్రం వద్ద ఎంఈవోతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

బాంబు పేలి వ్యక్తి దుర్మరణం

భోగాపురం, మార్చి17(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా మండలంలోని కవులవాడ సమీపంలో రాళ్లు పేల్చే బాంబు పేలడంతో రామచంద్రపేటకు చెందిన బోర కొత్తయ్య(35) సోమవారం దుర్మరణం పాలయ్యాడు. రామచంద్రపేటకు చెందిన కొత్తయ్య కొన్ని రోజులుగా ఎయిర్‌పోర్టు పనులు చేస్తున్నాడు. కవులవాడ సమీపంలో రాళ్లను పేల్చడానికి పేల్చేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు పేలింది. కొత్తయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. తగరపువలస ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కొత్తయ్య మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి తల్లి, భార్య ఎర్రమ్మ, ఇద్దరు కుమారులున్నారు. సీఐ ప్రభాకర్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

బెంగళూరులో జిల్లా యువకుడి మృతి

పూసపాటిరేగ, మార్చి17 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో సోమవారం మండలంలో కుమిలి గ్రామానికి చెందిన నరేళ్ల చంద్రమౌళి(25) రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం ఈ యువకుడు బెంగుళూరులో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం రైల్వేస్టేషన్‌కు వెళ్లి ప్లాట్‌ఫాంపై నడుస్తూ వెనుక వైపు నుంచి వస్తున్న రైలు గమనించలేదు. దాంతో వేగంగా వస్తున్న రైలు చంద్రమౌళికి తగలటంతో తీవ్రమైన గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలుస్తోంది.

రైలు నుంచి జారిపడి..

సీతానగరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గునాయుడుపేట సమీపంలో రైలు పట్టాల పక్కన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. జార్ఖండ్ రాష్ట్రం వెస్ట్‌సింగారం జిల్లా హట్గామారియా ప్రాంతానికి చెందిన ప్రదానహేమార్చరన్(23) ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు నుంచి జారిపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు కుటుంబీకులకు సమాచారం అందించినట్లు చెప్పారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

బాడంగి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బొత్సవానివలసలో బెల్లం క్రషర్ వద్ద పని చేస్తున్న యువకుడు ఏడువాక రామ్‌కుమార్(25) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వేపాడ మండలం డబ్బీరాజుపేటకు చెందిన రామ్‌కుమార్ మూడు నెలలుగా బొత్సవానివలసలోని ఓ బెల్లం క్రషర్ వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం క్రషర్ పనులు ముగించుకుని సంబంధిత సామగ్రిని వ్యానులో లోడ్ చేస్తున్నాడు. వ్యానుపై నుంచి నిలబడి సామగ్రిని లోడ్ చేస్తుండగా.. పైన వేలాడుతున్న విద్యుత్ వైర్లు చేతికి తగిలాయి. దీంతో రామ్‌కుమార్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

పాఠశాల కార్యాలయానికి నిప్పు

- రికార్డుల దహనం ●రామాంజనేయ కాలనీలో ఘటన

చీపురుపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామాంజనేయ కాలనీ ఉన్నత పాఠశాల కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం సాయంత్రం నిప్పు పెట్టారు. ఈ ఘటనలో కార్యాలయంలోని రికార్డులు, టీఎల్ఎం, ల్యాబ్ పరికరాలు దగ్ధమయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం పాఠశాల పనివేళలు ముగియగానే యథావిధిగా కార్యాలయానికి తాళాలు వేసి ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. ఆదివారం మధ్యాహ్నం పాఠశాల కార్యాలయం నుంచి పొగలు రావడం గమనించిన సమీకృత వసతి గృహం విద్యార్థులు హెచ్‌ఎం కంది గోపికి ఫోన్ చేసి చెప్పారు. ఆ సమయంలో హెచ్‌ఎం విజయనగరంలో ఉండడంతో పాఠశాలకు వెళ్లాలని హిందీ ఉపాధ్యాయుడు శ్రీరాములుకు సూచించారు. ఆయన పాఠశాలకు వచ్చి తలుపులు తెరిచే సరికి కార్యాలయంలోని బీరువాలో ఉంచిన లైబ్రరీ పుస్తకాలు, విద్యార్థులకు ఇచ్చే చిక్కీలు, పాతఅడ్మిషన్ దరఖాస్తులు కాలి బూడిదయ్యాయి. దుండగులు, తలుపులకు వేసిన తాళాలు బద్దలు కొట్టలేక, తలుపులకున్న చెక్కలు ఊడదీసి లోపలికి ప్రవేశించినట్టు ఉపాధ్యాయుడు గుర్తించారు. దుండగులు అక్కడే మద్యం సేవించి, కార్యాలయానికి నిప్పంటించారని భావిస్తున్నారు. గరివిడి ఎస్‌ఐ ఎల్.లోకేశ్ ఘటనా స్థలాన్ని సందర్శించి. కేసు నమోదు చేశారు.


విచారణ చేస్తున్న ఎస్‌ఐ లోకేశ్

రాముడుపేటలో పూరిళ్లు దగ్ధం

వేపాడ మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాముడుపేటలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో బెహరా పరదేశి, బెహరా రాము, బెహరా అప్పారావు ఇళ్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.


దగ్ధమవుతున్న పూరిళ్లు

ఇంటిపై రాళ్ల దాడి

రాజాం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజాం-శ్రీకాకుళం రోడ్‌లో ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఓ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దాడికి తెగబడ్డారు. రాళ్లతో కిటికీ అద్దాలు పగలగొట్టారు. శబ్దం విన్న ఇంటి యజమాని నందకుమార్ బయటకు వచ్చి చూసేసరికి ఎవ్వరూ కనిపించలేదన్నారు. ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నట్లు సీసీ ఫుటేజీ ఆధారంగా తెలుస్తోందని నందకుమార్ తెలిపారు. అయితే ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా, లేదా మద్యం మత్తులో ఆకతాయిల పనా అనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజాం పోలీసులు చెబుతున్నారు. ఘటన వివరాలను పోలీసులకు తెలియజేయనున్నట్లు నందకుమార్ తెలిపారు.

గంజాయి బ్యాచ్ అరెస్టు

గుర్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంపావతి నది సమీపంలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. వీరిలో ఎస్ఎస్ఆర్ పేటకు చెందిన ఇద్దరు, అలమండ సంత గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, నెలిమర్లకు చెందిన ఒక వ్యక్తి, దమరసింగి గ్రామానికి చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిని నుంచి 1.2 కేజీల గంజాయి, 5 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులను విస్మరించొద్దు

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి



మాట్లాడుతున్న శాస్త్రి

బొబ్బిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ తీరును సాహసోపేతంగా వ్యతిరేకించిన విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు విస్మరించవద్దని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి కోరారు. సోమవా రం స్థానిక వెలమవారి ఫంక్షన్ హాలులో ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ తమ సమస్యల సాధన కోసం వయస్సు రీత్యా రోడెక్కి ఆందోళ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని, ఆ కారణంగా తమను నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రామ్మూర్తి మాట్లాడుతూ పీఆర్సీ డీఆర్, అడిషనల్ క్వాంటమ్ పెన్షన్, హెల్త్‌కార్డుల సేవలు తమకు అత్యవసరమన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి లచ్చుపతుల జగన్నాథం, జిల్లా జనరల్ సెక్రటరీ రెడ్డి కృష్ణమూర్తి, మన్యం జిల్లా అధ్యక్షుడు డీజీ ప్రసాదరావు, చుక్క శ్రీరామ్మూర్తి, బెవర రమణ, కృష్ణమ్మ, వెంకటరావు, చింతల చిన్నమ్మతల్లి, చప్ప తిరుపతినాయుడు, శివున్నాయుడు, గేదెల చంద్రినాయుడు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతి

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి తెలిపారు. ఇందులోని భాగంగా స్థానిక ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావుకు ఆయన తమ సంఘ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

కొడుకుపై తల్లి ఫిర్యాదు

- ఇబ్బంది పెడుతున్నాడని ఏకరువు



బాధితురాలు నారాయణమ్మ

రామభద్రపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తన పెద్ద కుమారుడు భూమి పత్రాలు లాక్కొని ఇవ్వడం లేదని, క్యాన్సర్‌తో బాధపడుతున్న తనను ఇబ్బంది పెడుతున్నాడని మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన కోట నారాయణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణమ్మకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు సబ్‌ట్రెజరీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 1997లో మృతిచెందాడు. మూడో కుమారుడు విశాఖలో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. భర్త అప్పలస్వామి 2023లో మృతిచెందాడు. అప్పటి నుంచి కాలనీలోనే ఉంటోంది. రెండో కుమారుడు చనిపోయిన సమయానికి పెళ్లి కాకపోవడంతో పోలీసు శాఖ తండ్రి పేరున పింఛను మంజూరు చేసింది. ఆ డబ్బులతోనే వృద్ధులు ఇద్దరూ జీవనం సాగించేవారు. ఈమెకు రామభద్రపురంలో సుమారు 1.80 ఎకరాల పొలం ఉంది. అయితే పెద్ద కొడుకు భూమి పత్రాలు ఆన్‌లైన్ చేస్తానని చెప్పి వాటిని లొక్కొని ఆరు నెలల కిందట వెళ్లిపోయాడని, ఆ సమయంలో భూమి పత్రాలు ఇవ్వబోనని చెప్పడంతో తనను గాయపరిచినట్లు తల్లి చెబుతోంది. తాను క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, ఖర్చులకు డబ్బులు లేవని చెప్పినా పెద్ద కుమారుడు పట్టించుకోవడం లేదని విన్నవించింది. చిన్న కుమారుడు శంకరరావుతో కలిసి సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో మొరపెట్టుకుంది. అక్కడి అధికారులు రామభద్రపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించడంతో రామభద్రపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పెద్ద కుమారునికి ఫోన్ చేసి మంగళవారం స్టేషన్‌కు హాజరుకావాలని సూచించినట్లు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ పరిశుభ్రంగా ఉండాలి

బొబ్బిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంప్లెక్స్ చుట్టూ ఉన్న పరిసరాలన్నిటినీ పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆమె సోమవారం సందర్శించారు. కాంప్లెక్స్ చుట్టూ అధ్వాన పరిస్థితుల కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె దృష్టికి వచ్చింది. డ్రైనేజీలకు సక్రమంగా ఔట్‌లెట్లు లేకపోవడంతో ఈ సమస్య తీవ్రంగా తయారయ్యిందని తెలిపారు. డిపో మేనేజరుతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆమె స్థానిక అన్నా క్యాంటీన్‌ను సందర్శించి, అల్పాహారం నాణ్యతను పరిశీలించారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడవద్దని నిర్వాహకులకు సూచించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, సచివాలయ కార్యదర్శి ఉన్నారు.

బొబ్బిలిలో స్తంభించిన ట్రాఫిక్



బొబ్బిలి జెండా వీధి సెంటరులో ట్రాఫిక్ నెలకొన్న దృశ్యం

బొబ్బిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పలు కూడళ్లలో సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించింది. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఒక్కసారిగా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. వారిని తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో వాహనాల్లో రావడంతో ట్రాఫిక్ నెలకొంది. సమాచారం తెలియగానే సీఐ కటకం సతీష్‌కుమార్ తమ సిబ్బందితో జెండా వీధి జంక్షన్‌కు చేరుకున్నారు. స్వయంగా ఆయన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

బొబ్బిలి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో భాగంగా ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీను, ఎంపీడీవో పి.రవికుమార్, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, అన్ని శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షలను అన్ని కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహించేటట్లు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రభుత్వ చెరువులను కాపాడండి

బొబ్బిలి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చెరువులను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ ఎం.శ్రీనుకు ఫిర్యాదు అందజేశారు. బొబ్బిలి పట్టణంలో ఉన్న ప్రభుత్వ చెరువులను భూకబ్జాదారులు నుంచి కాపాడాలని కోరారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

బొబ్బిలి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు రైతులకు ఇబ్బంది పెట్టకుండా భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు కోరారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, సభ్యులు రెడ్డి త్రినాథ, రాపాక శ్రీనివాసరావు, బడి త్రినాథ పాల్గొన్నారు.

నిరసనల హోరు

- కలెక్టరేట్ వద్ద వివిధ సంఘాల ఆందోళన
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



బెలగాం: కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టిన గిరిజనులు

బెలగాం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం కలెక్టరేట్ సోమవారం నిరసనలతో హోరెత్తింది. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ వైద్య సేవ వైద్య మిత్రులు నిరసన చేశారు. జీవో నెం.28 రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ పద్ధతి లోకి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ● బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ సీహెచ్‌డబ్ల్యూలు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నాయకరాలు ఇందిర మద్దతు తెలిపారు. ● తమ గ్రామాల పరిధిలో ఎలిఫాంట్ జోన్ ఏర్పాటు చేయవద్దని కోరుతూ సీతానగరం మండలంలోని గుచ్చిమి, అంటివలస, అప్పయ్యపేట, రేవటివలస, జోగిం పేట తదితర గ్రామాల ప్రజలు నిరసన చేపట్టారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి

జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించి, దళారుల బారి నుంచి కాపాడాలని ఆది వాసీ గిరిజన, రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట 48 గంటల నిరసన దీక్ష చేపట్టారు. గిరిజనులు ఉత్పత్తి చేస్తున్న పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అలాగే జిల్లాలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమ వద్దు

పార్వతీపురంటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలకు హాని చేసే జీడి పరిశ్రమను పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు లో ఏర్పాటు చేయరాదని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పి.సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో పట్టణ పౌర సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో స్థానికులు రాస్తారోకో నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీదేవి, సీఐటీయూ నాయకులు, ఉమ, సూరిబాబు, డీవై ఎఫ్ఐ నాయకుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి

రెల్లి కులస్థులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని జిల్లా రెల్లికులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాలకొండ రాజశేఖర్ డిమాండ్ చేశారు. రెల్లి, ఉపకులాల వారికి ఒక శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన రహదారిలో గల ఇందిరా కాలనీ కూడలి అంబేడ్కర్ విగ్ర హం వద్ద నిరసన చేశారు. అనంతరం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతపత్రాన్ని అందజేశారు. ఉమ్మడి జిల్లాల కన్వీనర్ గౌరీశంకర్, ఆ సంఘ నాయకులు జి.డేనియల్, ఎస్.సంజీవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బెలగాం: ఎలిఫాంట్ జోన్ వద్దంటూ నిరసన



పార్వతీపురంటౌన్: నిరసన చేస్తున్న రెల్లి కులస్థులు



పార్వతీపురంటౌన్: జీడి పరిశ్రమ వద్దంటూ రాస్తారోకో

సమస్యల వెల్లువ

- కలెక్టర్ పీజీఆర్ఎస్‌కు 106 వినతులు



పార్వతీపురం: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన వినతులను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆ సమస్యలను వారంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 106 వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి జేసీ కె.హేమలతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 14..

బెలగాం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 14 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన పీజీఆర్ఎస్ నిర్వహించారు. అర్జీదారులను నుంచి స్వయంగా ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డీసీఆర్‌బీ సీఐ ఆదాం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



బెలగాం: సమస్యలు వింటున్న ఎస్పీ మాధవరెడ్డి

రుణాలు మంజూరు చేయండి

సీతంపేట రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు తమ రుణాలు మంజూరు చేయాలని పలువురు గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు తమ సమస్యలను వెల్లడించారు. పీజీఆర్ఎస్‌కు 54 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, పీహెచ్‌వో వెంకట గణేష్, డిప్యూటీ ఈవో రవి ప్రసన్నకుమార్, టీడబ్ల్యూ డీఈఈ సింహాచలం, ఐకేపీ ఏపీడీ సన్యాసినాయుడు, ఏటీడబ్ల్యూవో మంగవేణి పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

పాలకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్ 2023 జూలై 1 నుంచి ఏర్పాటు చేయాలని పాలకొండ పెన్షనర్ల సంఘం సభ్యులు కేవీ రమణమూర్తి, సీహెచ్ అచ్యుతరావు కోరారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. పలువురు పెన్షనర్ల సంఘం సభ్యులు ఉన్నారు.

శివారు గ్రామాలకు నీరందించాలి

తోటపల్లి ఎడమ కాలువ ద్వారా పాలకొండ మండల శివారు గ్రామాలకు సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, తోటపల్లి ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆలుబిల్లి పార్థసారధి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఆర్వో హేమలతకు వితిపత్రాన్ని అందించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పార్వతీపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డీజీ ప్రసాదరావు, రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరినాయుడు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందించారు.

న్యూస్ బాక్స్

రెండు దుకాణాలు దగ్ధం

సాలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోయల్ గ్రాండ్ హోటల్ సమీపంలో ఉన్న రెండు స్ర్కాప్ షాపులు సోమవారం ఉదయం అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు మంటలు అదుపుచేయటానికి ప్రయత్నం చేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేయగా హుటాహుటిన వచ్చి మంటలను నిలుపుదల చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బీసీ రుణాలపై అవగాహన

పాలకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం బీసీ కార్పొరేషన్ రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల దుర్గారావు అవగాహన కల్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

భామిని తహసీల్దార్‌గా శివనారాయణ

భామిని, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భామిని తహసీల్దార్‌గా ఎస్.శివనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుమ్మలక్ష్మీపురంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఈయన భామిని బదిలీపై రాగా.. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.అప్పారావు గుమ్మలక్ష్మీపురం బదిలీపై వెళ్లారు.

బెల్లంఊట ధ్వంసం

కురుపాం, మార్చి17: బియ్యాలవలస పంచాయతీ దుర్భిలి గ్రామం సమీపంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 700 లీటర్ల బెల్లం ఊటను కురుపాం పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారం మేరకు కురుపాం ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు.

తొలగిన జగన్ బొమ్మ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గరుగుబిల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రావివలస పీహెచ్‌సీ భవనంపై గతంలో ఏర్పాటు చేసిన జగన్ చిత్రాన్ని వైద్య సిబ్బంది సోమవారం తొలగించారు. ఆంధ్రజ్యోతిలో బొమ్మ మారదా..! శీర్షికన సోమవారం వెలువడిన కథనానికి స్పందించిన వైద్యాధికారి కార్తీక్.. జగన్ ముఖ చిత్రం ఉన్న ప్రాంతం కనిపించకుండా అతికించారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

బొబ్బిలి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని వనమిత్ర, సామాజికవేత్త కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన అలజంగి ప్రభుత్వ సీబీఎం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాబోవు కొన్ని రోజుల పాటు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ్‌శాఖ మేనేజింగ్ డైరెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. ఆయన ఫోన్‌లో సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. చత్తీస్‌ఘడ్ వైపు నుంచి వేడిగాలులు వీయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో ప్రజలు బయటకు రావద్దన్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, సీతంపేట మండలాలకు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతాయన్నారు.

హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

సీతంపేట రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా రేగులగూడ, దిగువ బుడగరాయి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండు హెల్పర్ పోస్టులు మంజూరైనట్లు ఐసీడీఎస్ సీడీపీవో రంగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ హెల్పర్ పోస్టుల భర్తీకి ఈనెల 19వ తేదీన అర్హులైన అభ్యర్థులకు ఐటీడీఏ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులు సీతంపేట ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చి కాల్‌లెటర్లు తీసుకోవాలని ఆమె సూచించారు.

రేపు జాబ్‌మేళా

పాలకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 19న జవహర్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.శ్యాంబాబు తెలిపారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాబ్‌మేళాలో జపనీస్ మల్టీ నేషనల్ కంపెనీ, కోల్‌గేట్ పామోలివ్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 19 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండి టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లమో అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్సులు, బయోడేటా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

గిరిజనులపై దాడి.. ఎస్పీకి ఫిర్యాదు

సాలూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం తోణాం పంచాయతీ మద్దెనవలస గ్రామంలో గిరిజనులపై కొందరు సెటిలర్స్ దాడి చేశారని కొండగొర్రి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు గిరిజన నాయకులు ఎస్పీ మాధవరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. మద్దెనవలస గ్రామానికి చెందిన కునేటి లక్ష్మణరావు, ఝూన్సీలపైన, వారి పిల్లలపైన కొందరు సెటిలర్స్ దాడి చేశారని, చంపుతామని బెదరించారని, కులం పేరుతో దూషించారని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ సాలూరు రూరల్ ఎస్ఐకి ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ● మద్దెనవలస సంఘటన విషయమై తమకు ఫిర్యాదు రాలేదని సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి చెప్పారు. బాధితులుగా పేర్కొంటున్న వ్యక్తులు కొట్టుపరువులో ఉంటే అక్కడకు వెళ్లి ఫిర్యాదు ఇవ్వాలని కోరానన్నారు.

ఆ భూములు మావే

సాలూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పుణికిలవలస గ్రామంలో దాదాపు 70 ఏళ్లకు పైబడి తామే భూములను సాగు చేసుకుంటున్నామని స్థానిక గిరిజనులు, బీసీ కులస్థులు తెలిపారు. సోమవారం సర్వే కోసం వచ్చిన అధికారులకు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. పుణికిలవలస వద్ద ఉన్న భూములకు తాము వారసులమంటూ మన్మథరావు, శశికళ అనే ఇద్దరు ఆర్‌వోఆర్ కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దీనిపై నివేదిక ఇవ్వాలని డీఆర్‌వోకు కోర్టు ఆదేశించింది. దీంతో సాలూరు మండల సర్వేయర్ టి.రామ్మోహనరావు, వీఆర్వోలు రాము, సతీష్, నవీన్.. ఆ గ్రామానికి వెళ్లి, సాగు చేస్తున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ భూములను 70 ఏళ్ల పైబడి తామే సాగు చేసుకుంటున్నామని తెలిపారు. తమ భూముల సర్వేకు అంగీకరించబోమన్నారు. అయితే సర్వే చేయాల్సిన ఆవశ్యకతను అధికారులు వివరించారు.

ఉరుకులు.. పరుగులు

- పన్నుల వసూళ్లలో రెవెన్యూ అధికారులు

పార్వతీపురంటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ఈనెల 30వ తేదీతో ముగుస్తుండడంతో పన్నుల వసూళ్లకు మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వేంకటేశ్వర్ల ఆధ్వర్యంలో సిబ్బంది తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. 2024-25 గాను గత, ప్రస్తుత ఇంటి, ఖాళీ స్థలం పన్నులకు సంబంధించి రూ.9.81కోట్లు బకాయి ఉండగా, ఇప్పటి వరకు రూ.4.48 కోట్లు వసూలు చేశారు. ఇంకా సుమారు రూ.5కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అలాగే కుళాయి పన్నులకు సంబంధించి రూ.3.25 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.52 లక్షలు వసూలు చేశామని మున్సిపల్ రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. ● ఈనెలాఖరు కల్లా పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు తనతోపాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మొండి బకాయిదారులు, సకాలంలో పన్నులు చెల్లించని వారి ఆస్తులను జప్తు చేస్తామన్నారు. ఆర్వో రూబేను, ఆర్ఐలు వినయ్, ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ వీరాభిమాని మృతి



సత్తిబాబు (ఫైల్)

సాలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ వీరాభిమాని ఆదాడ సత్తిబాబు(65) ఆదివారం రాత్రి తన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. తన నివాసం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన జయంతికి, వర్ధంతికి కార్యక్రమాలు నిర్వహించేవారు. ఎక్కడ పార్టీ కార్యక్రమం జరిగినా సత్తిబాబు పార్టీ జెండాలతో, పసుపు బట్టలతో వినూత్న రీతీలో కనిపించేవారు. సత్తిబాబు మృతి పార్టీకి తీరని లోటు అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆ కుటుంబానికి ప్రగడ సానుభూతి తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు నివాళి అర్పించారు.

రాజకీయ పార్టీ నాయకులతో ఆర్డీవో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోగల అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు సోమవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదు, తొలగింపు, ఓటర్ల బదిలీలు, మార్పులు వంటి ప్రక్రియ కొనసాగుతుందని ఆర్డీవో వారికి తెలిపారు. ఓటర్ల జాబితాలో ఏమైనా సవరణలు మార్పులు, చేర్పులు అవసరమైనచో సంబంధిత బూత్ స్థాయి అధికారులను కలిసి ఫారం 6, 7, 8 క్లెయిమ్స్ దరఖాస్తులను అందజేయాలన్నారు. వాటిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి ఏజంట్లను నియమించుకోవా లని అన్ని రాజకీయ పక్షాలకు ఆర్డీవో సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ప్రతి నెలా మొదటి వారంలో ఈ తరహా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బలివాడ గౌరీశంకర్, టీడీపీ, బీజేపీ, వైసీపీ, సీపీఎం ప్రతినిధులు వాసిరెడ్డి సత్యనారాయణ, తాడ్డి ఈశ్వరరావు, తమ్మిరెడ్డి దామోదరరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బి.సంకటక్ సమితిలో వినతుల స్వీకరణ

ఒడిశా

రాయగడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బి.సంకటక్ సమితిలో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. సమితి కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ నిహార్ రంజన్ కహార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొత్తం 39 మంది తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఆటవీ శాఖాధికారి సచిన్ అన్నాసాహెబ్ ఒహలే, జడ్పీ కార్యనిర్వాహణాధి కారి అక్షయ్‌కుమార్ ఖెముండు, జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్యవైద్యాధికారి లాల్ మోహన్ రౌత్రాయ్, గుణుపురం సబ్ కలెక్టర్ కిరణ్ దీప్‌కౌర్ పాల్గొన్నారు.

చైత్ర పండగలకు శుభరాట

రాయగడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8 నుంచి ప్రారంభం కానున్న మజ్జిగౌరి అమ్మవారి చైత్ర పండగలకు ఆలయ ప్రాంగణంలో సోమవారం శుభరాట వేశారు. ఆలయ ట్రస్టీ రాయసింగ్ బిడిక అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.